క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


జాదవ్ సురేశ్(ఫైల్)

సారంగపూర్: మండలంలోని రాయికానగర్‌కు చెందిన జాదవ్ సురేశ్(45) కనిపించడం లేదని ఆయన భార్య వచ్చల శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మహారాష్ట్రలోని హిమాయత్ నగర్‌కు చెందిన సురేశ్, ఆయన భార్య వచ్చల రెండేళ్ల కిందట రాయికానగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. రెండురోజుల కిందట బ్యాంకుకు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లిన సురేశ్ తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

లక్ష్మణచాంద: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని పీచర గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పీచరకు చెందిన రాజారపు ఆశన్న, అల్లి రమేశ్ అనే రైతుల గేదెలు గ్రామ శివారులోని గోదావరి సమీపంలోకి మేతకు వెళ్లాయి. అదే గ్రామానికి చెందిన బుర్రి దేవన్న, బుర్రి ఆశన్న నదికి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. గేదెలు గోదావరిలోకి దిగి నీళ్లు తాగుతుండగా.. విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.46వేలు ఉంటుందని తెలిపారు. రాజారపు ఆశన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవన్న, ఆశన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టు ఏపీపీగా నియమితులైన న్యాయవాది ఆసిఫ్ అలీ శనివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది మహ్మద్ ఖాజా తదితరులున్నారు.

నమూనా ఎన్నికలు


ఓటువేసేందుకు క్యూలైన్‌లో విద్యార్థులు

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటుహక్కును వినియోగించుకున్నట్లు హెచ్‌ఎం సురేశ్ తెలిపారు. ఎన్నికల సిబ్బందిగా ఉపాధ్యాయులు గణపతి, పండరి, జి.రాజేశ్వర్ వ్యవహరించారు.

కలెక్టర్‌ను కలిసిన సైకాలజిస్టు

ఖానాపూర్: సమష్టి సహకారంతోనే దివ్యాంగుల సంక్షేమం సాధ్యమవుతుందని నిర్మల్ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల సంస్థ ఫౌండర్, రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్, ఖానాపూర్‌కు చెందిన పన్నెల జనార్దన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికాలోని దివ్యాంగులైన పిల్లల కు అక్కడి ప్రభుత్వం పాఠశాలల్లో అందిస్తున్న సేవలను ఇక్కడి ప్రభుత్వ పాఠశాలల్లోని దివ్యాంగులకు ఎలా అందించవచ్చో వివరించారు. త్వరలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని చిన్నారులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు, మెలకువలపై నిర్వాహకులకు శిక్షణ నిర్వహిస్తానని కలెక్టర్‌కు తెలిపారు. వారి వెంట అవల్ సంస్థ ఫౌండర్ బండారి రమేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి పాఠశాలలో ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, సుజాతదేవి, రజనీకాంత్, శిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఎంఈఓ సుభాష్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్‌తో పోషకాహారం మరిచిపోతున్న ప్రస్తుత తరుణంలో సంప్రదాయ వంటకాల ప్రాధాన్యం తెలిసేలా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రమణారావు, హెచ్‌ఎం అమృతం, ఉపాధ్యాయులు గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు ఉన్నత, కుంటాల శాంతినికేతన్ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. హెచ్‌ఎం రాజేశ్వర్, ప్రిన్సిపాల్ సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు.. తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. హెచ్‌ఎం మల్కాగౌడ్, ఉపాధ్యాయులు వినోద్, దేవేందర్ ఉన్నారు.

పాఠశాలల్లో గణిత దినోత్సవం

నిర్మల్‌ఖిల్లాగేట్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు గణితంపై చార్టుల ప్రదర్శన, రంగవల్లులు ప్రవలిక, చిత్రలేఖనం, 1729 ఆకారంలో కూర్చొని ప్రదర్శన చేశారు. ప్రధానాచార్యులు కొండూరు నరేశ్, ఆచార్యులు పాల్గొన్నారు.

కుంటాల: భయం వీడి అభ్యాసం చేస్తే గణితంలో విద్యార్థులు రాణిస్తారని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించి గణిత బోధకులను సన్మానించారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజన్ సంఖ్య 1729 ఆకారంలో కూర్చొని ప్రదర్శన ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణ, నరేందర్‌రెడ్డి, అశోక్, కృష్ణ, హరీశ్, రాగిణి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద, పార్‌పెల్లి, మల్లాపూర్, చామన్‌పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీలో గణిత దినోత్సవం నిర్వహించారు. నిరంతర అభ్యాసంతో గణితంపై పట్టు సాధించవచ్చని ఎంఈవో అశోక్‌వర్మ పేర్కొన్నారు. హెచ్‌ఎంలు రాజునాయక్, మోహన్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్, సారంగాపూర్, వివేకానంద పాఠశాలల్లో రామానుజన్ జయంతి నిర్వహించారు. విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంతోపాటు మండలంలోని ఆయా పాఠశాలలు, కళాశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్ విద్యార్థులకు గణితం గొప్పతనం వివరించారు. ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం బలిన గజ్జారం, ఉపాధ్యాయులు రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విన్నర్స్ ఒలింపియాడ్, వాసవి కిడ్స్ పాఠశాలల్లో విద్యార్థులు గణిత నమూనాలను ప్రదర్శించారు.

కుభీర్: మండలకేంద్రంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు 10 నమూనాలను ప్రదర్శించారు. గంగారాం, హెచ్‌ఎం హన్మాండ్లు, పాఠశాల అధ్యక్షుడు పి.లక్ష్మణ్, కార్యదర్శి పి.పిరాజీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు హన్మాండ్లు తదితరులున్నారు.


లక్ష్మణచాందలో రామానుజన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు


కుభీర్ శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో..



కుంటాల ఆదర్శ పాఠశాలలో..


నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాలలో..


భైంసారూరల్: 1729 ఆకారంలో విద్యార్థులు

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌ఖిల్లాగేట్: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు నందెడపు చిన్ను, కౌన్సిలర్లు శనిగారపు నరేశ్, సోన్, దిలావర్‌పూర్, మామడ, నర్సాపూర్ మండలాల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, లక్ష్మణచాంద మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నిమ్మ సాయన్న , నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో శ్రీహరిరావు

సంఘ భవనానికి స్థలం మంజూరు చేయాలి

నిర్మల్‌ఖిల్లాగేట్: జిల్లాకేంద్రంలో దివ్యాంగుల సంఘ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న అన్నారు. శనివారం తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం పక్కన ఖాళీస్థలం ఇప్పించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసయ్య, కార్య నిర్వాహక కార్యదర్శి ముత్యం, భగవాన్, చిన్నక్క, భూమేశ్, సముద్రాల సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి

సోన్: మండలకేంద్రంలోని అభ్యాస గురుకులంలో శనివారం ప్రపంచ ధ్యాన్య దినోత్సవం నిర్వహించారు. సన్మార్గంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. అనంతరం ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ధ్యానం చేశారు.

భైంసాటౌన్: యోగా, ధ్యానంతో ఒత్తిడి జయించవచ్చని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భీమారావు అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థులతో కలిసి ధ్యానం చేశారు. రోజువారీ జీవితంలో ధ్యానానికి సమయం కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘునాథ్, రవికుమార్, పిజి రెడ్డి, సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.


సోన్‌లో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

కుంటాల: మండలకేంద్రంలోని యోగా కేంద్రంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు యోగా చేసి ధ్యానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాపు, యోగా శిక్షకురాలు మౌనిక పాల్గొన్నారు.


ప్రారంభమైన పునఃప్రతిష్ఠాపన

బాసర: మండలకేంద్రంలోని శ్రీ పాపహరేశ్వర ఆలయ శిఖర, ఉత్సవ విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు మొదటిరోజు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్ఛరణల నడుమ వైదిక బృందం, పలుగుట్ట మంగి, రాములు మహరాజ్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. గోదావరి జలాలతో అభిషేకం అనంతరం గణపతి, సంతాన నాగేంద్రుడు, అన్నపూర్ణ, నందీశ్వరుడు, కాలభైరవుడు, వీరభద్రుడు, బలిపీఠాలు, నవగ్రహాల ప్రతిమలను ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శివుడి ప్రతిమకు రుద్రాభిషేకం, బిల్వార్చన, చండీ హోమం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వైదికబృందం మంగళచరణం, ధ్వజరోహణం, గౌరీ, స్వస్తి పుణ్యవచనం, పంచగవ్య ప్రశానం, రక్షాబంధనం, రుత్విక్, వరణం, అఖండ దీపస్థాపన, గోపూజ, యాగశాల ప్రవేశం, పునఃగణపతి పూజ, పంచచార్య నవగ్రహ, చతుష్షి, హారతి, వేదోపచారాలు నిర్వహించారు. భక్తులకు మాజీ సర్పంచ్ శైలజ సతీశ్‌రావు అన్నదానం చేశారు.


మంగళహారతులతో వస్తున్న మహిళలు

ఆది దంపతుల కల్యాణోత్సవం

నర్సాపూర్(జి): మండలకేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో కొలువు దీరిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి (ఆదిదంపతుల) కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వస్తి పుణ్యహవచనం, మూలవిరాట్ అభిషేకం, స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం పురోహితులు నరహరిశర్మ, రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆదిదంపతుల కల్యాణం జరిపించారు. నర్సాపూర్ (జి)కి చెందిన నిమ్మ సుశీల–రాములు దంపతులు కల్యాణ ఘట్టానికి దాతగా ఉండి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆదివారం దేవుని చెరువు జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు తమ సేవలు అందించారు. బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు.


ఆది దంపతుల విగ్రహాలు


కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

సంక్షిప్త వార్తలు

రేపు కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

భైంసారూరల్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వేదం తపోవన్ పాఠశాలలో కబడ్డీ జూనియర్ బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అసోసియేషన్ కార్యదర్శి సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 12 జనవరి 2005 తర్వాత జన్మించి, 70 కేజీల్లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన వారు 63018 43139, 93983 66221 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పట్టాభూమిని రైతులకు ఇవ్వాలి

లోకేశ్వరం: మండలంలోని రాజేశ్‌తండాలో పలువురు రైతుల భూమిలో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిందని.. ఇప్పటికైనా పట్టా భూమిని సదరు రైతులకు అప్పగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాజేశ్‌తండాలో క్రీడా ప్రాంగణాన్ని పట్టాదారు మోతీరాం, కిషన్ గణేశ్‌తో కలిసి పరిశీలించారు. కొన్నేళ్ల కిందట మోతీరాం, కిషన్, గణేశ్‌కు చెందిన 1.30 ఎకరాల భూమిలో క్రీడా ప్రాంగణం, శ్మశానవాటిక ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. అధికారులు స్పందించి పట్టా భూమిని రైతులకు అప్పగించాలని.. లేకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిమ్మాపూరం ముత్తన్న, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణదాస్ ఉన్నారు.

వైద్యశిబిరం

సారంగపూర్: మండలకేంద్రం సమీపంలో కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం టీమ్ విమలాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురికి మొబైల్ ల్యాబ్ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైద్యులు విమలాకర్‌రెడ్డి, దినేశ్‌రెడ్డి, బాలారెడ్డి, గౌర, ఫణి, రాజు పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో 108 సేవలపై ప్రోగ్రాం మేనేజర్ మధుకుమార్ అవగాహన కల్పించారు. ఆపద ఉంటే సమాచారం ఇవ్వాలని.. క్షణాల్లో బాధితుల వద్దకు చేరుతుందని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ లింగాచారి, ఈఎంటీ దీపక్, పైలెట్ నవీన్‌కుమార్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన బృందం

తానూరు: మండలంలోని హింగిర్గాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు శనివారం తనిఖీ చేశారు. కూలీలు చేసిన పనుల కొలతలు పరిశీలించారు. ఎస్సార్పీ పాండురంగ్ మాట్లాడుతూ గ్రామాల్లో తనిఖీ బృందాలు పనుల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్ , పోశెట్టి, రమణ తదితరులు ఉన్నారు.

‘కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి’

లోకేశ్వరం: స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాజూరలో మూడు పోలింగ్ బూత్ కమిటీల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీధర్, పోతన్న, చిన్నారావు, రమేశ్, మహేందర్, మురళి, సరస్వతి ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయం లెక్కించారు. రూ.24182 ఆదాయం సమకూరినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఇందులో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వరికొయ్యలను కలియదున్నాలి

కుంటాల: పొలాల్లోని వరికొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని ఏఈవో గణేశ్ అన్నారు. శనివారం మండలంలోని అందాకూర్ శివారులో రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యలకు నిప్పు పెడితే భూసారం తగ్గుతుందని పేర్కొన్నారు.

హార్డ్ కాపీలు అనవసరం

నిర్మల్ టౌన్: ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ మహిళలు హార్డ్ కాపీలను జిల్లా మైనార్టీ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సిన అవసరం లేదని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి మోహన్ సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఖానాపూర్: మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మంజుల, రాజేశ్వర్, మంగా, లక్ష్మి తదితరులున్నారు.

పండ్ల దినోత్సవం

కుభీర్: మండల కేంద్రంలోని చాణక్య సంస్కృతీ పాఠశాలలో శనివారం పండ్ల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పి.నరేశ్ మాట్లాడుతూ పండ్లతో కలిగే లాభాలను వివరించారు. అంతకుముందు రామానుజన్ జయంతి నిర్వహించారు. కరస్పాండెంట్ పి.సతీశ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గురుకులం సందర్శన

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, వసతులు, వంటశాల, పరిసరాలు పరిశీలించారు. నూతన మెనూ అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

మల్లన్న పల్లకి ఊరేగింపు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లికి.. నిర్మల్‌రూరల్ మండలంలోని మల్లన్న దేవుడి పల్లకి శనివారం చేరుకుంది. ఈసందర్భంగా గ్రామ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ వీర హనుమాన్ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. అభిషేకం, అలంకరణ, పూజలు చేశారు. గజేందర్ అన్నదానం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి, గొల్లమాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం రూ.లక్ష ఐదు వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నారాయణరావు పటేల్.. తన నివాసంలో అందించారు. మోతిలాల్ పటేల్, నాకిడి నవీన్, సయ్యద్ కలీం, లక్ష్మణ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బోరిగాంలో భక్తజనం

- ముగిసిన హనుమాన్ జాతర
- అంతర్రాష్ట్ర మల్లయోధులకు బహుమతుల ప్రదానం


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

తానూరు: మండలంలోని బోరిగాం హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కొనసాగుతున్న జాతర శనివారం ముగిసింది. తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని ధర్మాబాద్, భోకర్ ప్రాంతాల భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.


పోటీలు తిలకిస్తున్న నాయకులు

ఆచారం ప్రకారం జాతర సందర్భంగా అంతర్రాష్ట్ర మల్లయోధులకు గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు ప్రారంభించారు. నాందేడ్‌కు చెందిన రాజుపటేల్ ప్రథమ బహుమతి రూ.10,001, వెండి కడియం, ఢిల్లీకి చెందిన సోనుకు ద్వితీయ రూ.7,001 నగదు, వెండి కడియం బహుకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, విఠల్ తదితరులు ఉన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్స చేయించాలి

సోన్: దీర్ఘకాలంగా ఎదకు రాని పశువులకు తప్పనిసరిగా గర్భకోశ చికిత్స చేయించాలని జిల్లా పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని పాకపట్ల గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఎదకు వచ్చినపుడు గోపాలమిత్రలకు సమాచారమిస్తే వారు వచ్చి వీర్యనాళికలు వేయిస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఓంప్రకాశ్, జేబీఓ మురళి, సూపర్‌వైజర్ గోపాల్, గోపాలమిత్రలు భోజన్న, సురేశ్, నాయకులు మార గంగారెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశువైద్యాధికారి బాలిక్ అహ్మద్

రేపు జాబ్ మేళా

నిర్మల్‌ఖిల్లాగేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నిర్మల్ జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో పేటీఎంలో ప్లేస్‌మెంట్ కోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి గోవింద్ తెలిపారు. నిర్మల్‌లో 30, భైంసాలో 30, బాసర -ముథోల్ 05, బోథ్ - నేరడిగొండలో 05, ఖానాపూర్‌లో 10, మామడలో 06, సోన్ 04, నర్సాపూర్(జి)లో 05, లోకేశ్వరంలో 05 చొప్పున ఖాళీలు ఉన్నాయని వివరించారు. పదో తరగతి ఆపై చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు యువతి యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు

కడెం: మండలకేంద్రంలో శనివారం ముందస్తుగా సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు ఎస్ఎన్ రెడ్డి జెండా ఎగురవేశారు. ఇందులో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉపాలి, జిల్లా కార్యవర్గ సభ్యుడు భుక్యా రమేశ్, తదితరులున్నారు.

ఖానాపూర్: సమరశీల పోరాటాలు, ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించవచ్చని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి, సీనియర్ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి అన్నారు. సీపీఐ 99 ఏళ్ల పూర్తి చేసుకొని ఈనెల 26న శతాబ్ది వార్షికోత్సవంలోకి అడుగు పెడుతుందని పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని తాపి మేస్త్రి సంఘ భవనంలో పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కుడుకుంట రవి, రమేశ్, నర్సింహులు, శంకర్ తదితరులున్నారు.

రెండోరోజుకు సమ్మె

తానూరు: తమ డిమాండ్లు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు తానూరులో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండోరోజుకు చేరింది. విద్యార్థుల మెనూ చార్జీలు పెంచి.. నెలకు రూ.10వేల గౌరవ వేతనం, రూ.500కే సిలిండర్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కార్మికులు గంగాధర్, సవిత్రాబాయి, గంగాధర్, రేణుకాబాయి, గోదావరి బాయి, గంగసాగర్, లాలు తదితరులు ఉన్నారు.

‘అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి’

భైంసాటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని భైంసా ఏఎంసీ చైర్మన్ సింధే ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్ ఫారూఖ్ అహ్మద్ అన్నారు. శనివారం వారు పట్టణంలోని తమ కార్యాలయంలో మాట్లాడారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

కడెంలో..

కడెం: అంబేద్కర్‌పై వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్, నేతకాని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్ డిమాండ్ చేశారు. కడెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. ఇందులో పసుల రాజలింగం, భుక్యా రమేశ్, గంగాధర్, నగేశ్, జోసెఫ్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.